
నవ్యాంధ్ర రాజధాని కొందరికి భవిష్యత్ స్వప్నం; ఇంకొందరికి వర్తమాన సర్పం.
అది సాకారం కాగల స్వర్ణస్వప్నమా లేక సరీసృపమా అనే విచికిత్సే ఈ కథ.
కళ్లముందే కనుమరుగవుతున్న వ్యవసాయ సంస్కృతి; అంతరిస్తున్న
ప్రాకృతిక సంపద; సిమెంట్ రంగు పులుముకొంటున్న ఆకుపచ్చని నేల.
అది చూసి కలత చెందిన ఈ రైతు కొడుకు ఆవేదనకు అక్షర రూపమే అది.

పాపినేని శివశంకర్

10

# కొండచిలువ

యేలె లక్ష్మణ్





'రాజధాని' అనే నాలుగక్షరాల మాట వసంత్‌కి ఏడురంగుల ఇంద్ర ధనుస్సు అయ్యింది. అది మళ్లీ మళ్లీ కళ్ల ముందు కదలాడుతుండగా ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో దిగాడు. స్పైస్ జెట్ అనబడే ఎయిర్‌క్రాఫ్ట్ చెవులు దిబ్బిళ్లు పడే పెనుమోత కూడా ఆ దృశ్యం నుంచి అతణ్ణి దూరం చెయ్యలేకపోయింది. ఎయిర్‌పోర్ట్ నుంచి బెజవాడ దాక రహదారికి అటు ఇటు మొలిచిన ఏడురంగుల ఇంద్రధనుస్సు మొలకలు (పూలు లేకపోయినా) అతనికి కనువిందు చేసినియ్. ఇదుగో అదుగో అని అప్పుడే నాలుగేళ్లయిపాయె సొంతూరికి వచ్చి. ఊపిరి సలపని ఉద్యోగ బాధ్యతలు.

నాన్న పోయినాక కొన్నాళ్లు అమ్మ తన దగ్గరే ఉంది. నగర వాతావరణం నచ్చలేదు. ఊళ్లో ఉంటానికే మొగ్గింది. బాగోగులు చూట్టానికి బావమరిది ఉంటాన తనూ అడ్డు చెప్పలేదు. మధ్య మధ్య భార్య, పిల్లలు సెలవుల్లో అక్కడికి వెళ్లిరావటం, అమ్మ యిక్కడికి రావటం జరుగుతూనే ఉంది. ఇప్పుడు ఈ పొలం సర్వే పేచీలో వసంత్ అర్జంటుగా ఊరికి రావాల్సి వచ్చింది.

రెండెకరాల పొలం రాజధాని భూసమీకరణకి ఇయ్యటానికి సంతోషంగా సరేనన్నాడు వసంత్. తండ్రి తర్వాత సొంతంగా సాగు చేసేవాళ్లు లేరు. తన ఉద్యోగం తనది. పొలమేమో కౌలుకి. దానిమీద రాబడీ పెద్దగా లేదు. అనుకోని అవకాశం వచ్చింది. పొలం బదులు ప్లాట్లు. నివాసానికి ఒకటి. వాణిజ్యానికి ఒకటి. రాజధాని గనక రేటు పెరుగుతుంది. తేలిగ్గా అమ్ముకోవచ్చు. రేప్పొద్దున ఏ వ్యాపారానికైనా లీజుకియ్యొచ్చు. ఇదంతా మహా నగరమై మధ్యలో మన స్థలం ఉందంటే ఎంత విలువ!

అమ్మ ఆరోగ్యంగానే ఉంది. "ఒక్కడివే వొచ్చావు. కోడలు, పిల్లలేర్రా?" అడిగింది. శారదమ్మ మొహంలో సగం సంతోషమే.

కాసేపటికి బావమరిది శీను వచ్చాడు. ఆ మాటా ఈ మాటా అయినాక సర్వే సంగతి చెప్పుకొచ్చాడు. శారదమ్మ పొలానికి కాడిగట్టు

పొలం కోటేశ్వర్రావుది. రాజధాని కోసం ఇద్దరూ తమ పొలాలు పూలింగ్‌కి ఇచ్చారు. పొలం తల్లి పేరుతో ఉంది గనక శారదమ్మే సంతకాలు పెట్టింది. ఇప్పుడు ఇద్దరి పొలాల కొలతల్లో తేడా రావటంతో ఏదీ తేలక పోవటాన ఫైనల్ సర్వేకి రమ్మని వసంత్‌కి కబురు చేశాడు శీను.

“ఏందో ఒరిగి ఒళ్లో పడిద్దని పూలింగ్‌కి ఒప్పుకొన్నాం. ఇప్పుడిప్పుడే బయటపడ తంది బండారం,” అన్నాడు శీను.

“ఏమైందిప్పుడు?”

“అటు జూస్తే పొలమూ పోయె. ఇటు జూస్తే పనులూ నాస్తి. ఏం జెయ్యాలో తోసటంలా,” శీను ముటముటలాడతన్నాడు.

“కావాలనే యిచ్చావ్‌గా నీ పొలం?” అన్నాడు వసంత్.

“నిజమే.”

“మరిప్పుడు ఈ తెగులేంది నీకు?” నవ్వుతూ అడిగాడు వసంత్. “ఉగాది రోజు అనంతారం సభలో ముఖ్యమంత్రి ప్రసంగం నెట్‌లో చూశా. ఆయన, ‘నా మీద నమ్మకంతో భూములిచ్చారు రైతులు. వారి ఋణం తీర్చుకుంటా,’ అని పదే పదే నొక్కి చెప్పాడు గదా?”

‘ఏందోనబ్బాయ్! ఈడి సోప ఇనలేకపోతన్నాం. ఊళ్లో అందరూ ఒప్పుకున్నా రుగా? మన మొకాన్నే పొద్దు బొడిసిందా? ఒక్కళ్లం అడ్డం దిరిగితే మాత్రం ఆగిద్దా? నలుగురితో పాటు నారాయణ,” అందుకుంది శారదమ్మ.

“ఈ తెగులు నా ఒక్కడిదే కాదు బావా! ఊరంతటిదీ. అత్తా! నువ్వా యిను వైనం. పొలాలు మేమే యిచ్చాం అన్నది నిజమే. అయితే అది ఆయన మీద నమ్మకంతో కానే కాదు. మా అంతట మేమే యిచ్చామనటం పచ్చి అబద్ధం. గొంతుమీద మెత్తగా కత్తి పెట్టి, ‘మర్యాదగా’ అడిగితే ఎవుడైనా యియ్యక సస్తాడా? మర్యాదకి మర్యాద, బెదిరింపుకు బెదిరింపు. పొమ్మనక్కర్లా, పొగబెడితే సాలు,” చెప్పాడు శీను.

“గొంతుమీద కత్తేంటి?” అడ్డు తగిలాడు వసంత్.

“చానా తెలివిగా వలేసింది గవర్మెంటు. రాజధాని అంటే గొప్ప వరమంది. దేశంలో అన్ని ప్రాంతాలూ వదిలేసి ఇక్కడికి రావటం మీ అదృష్టమంది. భూ సేకరణ గాదు, సమీకరణ అంది. సమీకరణ ప్రచారం కూడా తమ పార్టీకి తిరుగులేని తుళ్లూరు, నేలపాడు మొదలైన ఊళ్ల నుంచే తెలివిగా మొదులుబెట్టారు. ఎకరానికి వెయ్యి గజాలు ఇళ్ల స్థలం, రొండొందలు వాణిజ్యస్థలం ఇస్తామంది. రైతులు బంగారం కళ్ల జూస్తారన్నాడు ముఖ్యమంత్రి. (ఈ రైతులందరికీ విడతలుగా గాకుండా ఒక్కమాలే

రుణమాఫీ కూడా చేస్తామన్నాడు.) గజం కనీసం పదేలు లెక్కలేశారు జనం. ఎకరం పొలానికి కోటి రూపాయలు తేలిద్దన్నమాట.

'ఇటేపు జూద్దామా అంటే ఏ యేటికాయేడు తగిలేదేగాని మిగిలేది లేదు. గ్రామీణబ్యాంకులో బాకీ లేని రైతులు ఎవురో నూటికి కోటికి. ఏం జెయ్యాల? రైతుబిడ్డ లెవురూ యవసాయం జెయ్యటంలా. చేసేవాడికి ఎవుడూ పిల్లనియ్యటంలా. మనూళ్లో పెళ్లికెదిగిన మగపిల్లలు పదిమందున్నారు! ఆడపిల్లలు ఆళ్లవంక కన్నెత్తి చూట్టంలా. కొంతమంది ఊరొదిలి ఎయ్యెయ్యో ఉద్దోగాలకోసం దేశాలమీద బొయ్యారు, నీకు మల్లే. పెద్దాళ్లేమో ఆ యిళ్లూ వాకిళ్లకి కాపలాగా మిగిలారు. కౌళ్లు సరిగా రావు. కాడిగట్టు తగాదాలు సరేసరి. ఇయ్యన్నీ పడలేక అందొచ్చిన బేరం గందా అని పెద్దాళ్లొప్పుకున్నారు. గడ్డ పలుగులే గాలికెగిరి పోతంటే పులిస్తరాకు నా సంగతేంది అందంట. అట్టనే పెద్ద పెద్దాళ్లే యిచ్చేస్తుంటే మనమెంతని నాలాంటి సిన్నా సితకా రైతులూ ముందుకొచ్చారు.

"భూసమీకరణకి ఒప్పుకోకపోతే భూసేకరణ తప్పదని మంత్రులేంది, కలెక్టరేంది, అంతా పురెక్కిచ్చారు. అప్పుడైతే గవర్మెంటు ఎంత రేటు గడితే అంతే గదా? తప్పదియ్య! అదీ పొగ బెట్టటమంటే.

"అంతకు దప్ప పొలమంటే రైతుకు పేణం గందా! అంత తేలిగ్గా వొదులు కోటానికి మొగుస్తాడా? ఒక్క లోనుకి పదిసార్లు పెదక్షిణం జెయ్యాల బ్యాంకుల చుట్టూ. పెద్ద పెద్ద దొంగనాయాళ్లకి కోట్లు కోట్లు రుణాలిచ్చి, ఆళ్ల చుట్టూ కుక్కలల్లే తిరుగుతియ్ బ్యాంకులు. యవసాయానికి ఎగనామం బెట్టి దాన్ని జూదంగా జేసింది గవర్మెంటు. ఇత్తనాల దగ్గిర్నుంచి పంటదాకా అంతా మోసమే గందా! పంటకి గారెంటీ లేదు. పండిందానికి రేటుండదు. అమ్మబోతే అడివి, కొనబోతే కొరివి. ఎనకటి మాదిరి గాదు. యవసాయం మీద బెమ తగ్గిపోయింది రైతులికి. వొదులుకోక ఏం జేత్తారు?"

ఇన్నాళ్లుగా ఉగ్గబట్టుకుందంతా బావముందు కక్కేశాడు శీను.

"ఇప్పుడు పొలాల రేట్లు గూడా విపరీతంగా పెరిగినియ్ గదా! దండగేముంది?" ప్రశ్నించాడు వసంత్.

"ఎందుకు పెరిగినియ్? సందులో సందుగా రాజధాని అనంగానే రియల్ ఎస్టేట్ వాళ్లు రంగంలోకి దిగారు. లక్షలు పలికే పొలం ఆవజాన కోట్లలోకి యెళ్లిపో యింది. తుళ్లూరు సెంటర్ గనక అక్కడ ఎకరం కోటిన్నర. చుట్టుపక్కల ఊళ్లల్లోనైతే కోటికి పై మాట. జరీబు పొలాల సంగతి యేరులే. రాయిపూడి, లింగాయపాలెం, ఉద్దండ్రాయపాలెం, కృష్ణాయపాలెం, ఉండవల్లి- ఇయ్యన్నీ ఏటొడ్డు ఊళ్లు. నువు

జూశావుగా. అరిటేంది, జామేంది, మావిడేంది, పసుపేంది, మొక్కజొన్నేంది- ఏడాదికి మూడు పంటలు. అయి అంతకు మునుపే రొండు కోట్లు పలికేయి. అయి మొత్తం ఈ దెబ్బకి గోయిందా. పార్టీలమూలాన రైతుల్లో కట్టుబాటు లేదాయె. కనక గవర్మెంటు పని తేలికైంది."

శీను అసలు బాధ వేరే ఉంది. ఇన్నేళ్లనుంచీ బావ పొలం తనే కౌలుకు చేస్తన్నాడు. పండినేడు ఇస్తే తీసుకుంటారు. లేదంటే లేదు. శీను ఎంతిస్తే అంతే. అట్లాగని శీను బావనెప్పుడూ మోసం చెయ్యలేదు. 'బావమరిది బతకగోరతాడు,' అనే సామెత ఉండనే ఉంది. అయితే ఇప్పుడు నోటికాడ కూడు గద్ద తన్నుకుపోతున్న ట్టుంది. ఇకనుంచి ఈ పొలం కౌలు చెయ్యలేడు. ఇదే కాదు, ఇంకే పొలమూ ఊళ్లో మిగలటం లేదు. మరింకేం చెయ్యగలడు తను? ఎద్దు ముడ్డి పొడవటం తప్ప ఇంకే పనీ చేతగాదు తనకి. అక్కాయ్ కట్నం కింద మూడెకరాలు పోతే, ఇన్నేళ్ల యవ సాయంలో అప్పుల కింద రొండెకరాలు అమ్మేస్తే యింకేం మిగిలింది? అరెకరం చింత. తోడుగా కౌలు పని ఉంటాన ఏదో అట్టట్ట జరిగిపోతంది.

పోరంబోకు బీళ్లన్నీ ఎవురెవురో దున్నేసుకున్నాక ఎడ్ల మేత, సాగుబడి తలకు మించిన బరువైంది శీనుకి. బట్టకోడెలు రెంటినీ నిలువునా అమ్మేశాడు. ఇంకొంత లోను తీసుకోని మహీంద్ర ట్రాక్టర్ కొన్నాడు. లోను ఇంకా తీరలా. ఇప్పుడు పులిమీద పుట్ర మాదిరి రాజధానికి పూలింగ్ వచ్చింది. చేతిలో పొలం జారిపోయె. 29 ఊళ్లల్లో యవసాయం బంద్. కొట్టంలో ట్రాక్టరు, నాగలి సెట్టు, గొర్రు సెట్టు తుప్పు బట్టి దీనంగా చూస్తన్నయ్. అమ్ముదామన్నా కొనే నాథుడు లేడు. ఇయ్యాలో రేపో వాటిని పాత యినుం కింద కాటా బెట్టాల్సిందే. నట్టింటో గుండెలమీద కుంపటికి మల్లే ఇద్దరు ఎదిగిన కూతుళ్లు. అంత ఎండలోనూ అంతా చిమ్మచీకటిగా కనపడతుంది శీనుకి.

మాపటేళ బావమరిది భోజనానికి పిలిస్తే వెళ్లాడు వసంత్.

"మంచినీళ్లు బాగుండయ్యే. బావుల్లో నీళ్లు మారినియ్యా ఏంటి?" అన్నం తింటా అడిగాడు వసంత్.

నవ్వాడు శీను బావ అమాయకత్వానికి.

"కాదన్నయ్యా! బాయిల్లో నీళ్లేడుండయ్? ఊరబాయిలు ఎండిపొయ్యి, పూడి పొయ్యి చానా ఏళ్లయింది. వాటర్ కాన్‌లే గతిప్పుడు," చెప్పింది ఈశ్వరి.

❖

తెల్లారి ఇద్దరూ ఊరికి పడమట ఉన్న పొలం కేసి వెళ్లారు. సర్వేయర్లు ఇంకా రాలేదు. చేనొడ్డున కుంట మాత్రం అట్లాగే ఉంది. అయితే చుక్క నీళ్లు లేవు అందులో. రెండు మూడు పచ్చపిట్టల (గిజిగాడి) గూళ్లు కుంట ఒడ్డున పడి ఉన్నాయి.

"నానా! ఆ గూళ్లేందే?" చిన్నప్పటి వసంత్ అడుగుతున్నాడు. కుంట ఒడ్డున ఉన్న నల్లతుమ్మ చెట్టుకొమ్మలు నీళ్లకాన వంగి ఉన్నయ్. వాటికి చానా గూళ్లు వేలాడుతున్నయ్.

"అయ్యి గిజిగాడి గూళ్లురా," చెప్పాడు నాన్న. బుల్లి బుల్లి పచ్చపిట్టలు ఎగురుకుంటా వాలుతున్నయ్. అసలే ముళ్లచెట్టు. లోతైన కుంట. నీళ్లపైన వేలాడే గూళ్లు వసంత్‌ని అబ్బురపరిచినియ్. అదే అడిగాడు తండ్రిని.

"వాటికక్కడే బద్రంగా ఉంటదిరా. వాటిని తింటానికి పాములు, పిల్లులు ఆ ముళ్లచెట్టు కొమ్మలదాక పోలేవు. ఇక గొంతు తడుపుకోవటానికైనా దూరం పోనక్కర్లా."

"క్లె! క్లె! ఆ పీసుల్తో అట్టాంటి గూడు ఎట్ట అల్లినియ్యో!" అబ్బురపడ్డాడు వసంత్.

నాన్న నవ్వాడు. "అరే! మడుసులేసే మారాముళ్ల కింద ఈ గూళ్లు బలాదూరేరా!"

ఆ సంగతి ఇన్నేళ్లకి అర్థమైంది.

వసంత్ పొలం సర్వే నెం. 27లో ఉంది. అందులో 27/ఎ, 27/బి అని రెండు సబ్ డివిజన్‌లు. తాతల కాలంనాడు అన్నదమ్ముల వాటాలు అవి. 27/ఎలో కోటేశ్వరావుకి రెండెకరాలు, 27/బిలో శారదమ్మ పొలం రెండెకరాలు ఉండాలి. పాసు పుస్తకాల్లోనూ అట్లాగే ఉంది. గట్టురాళ్ల ప్రకారం కొలిస్తే రెండెకరాల లెక్కన తేలుతుంది. సర్వే లెక్కల ప్రకారమైతే సబ్ డివిజన్ లైను శారదమ్మ పొలంలోకి తంతుంది. 20 సెంట్లు తక్కువ తేలుతుంది. ఆ డివిజన్ ఒప్పుకోనంటాడు అత్త తరుపున శీను. సర్వే ప్రకారమే జరగాలంటాడు కోటేశ్వరావు. అదే తగాదాకి మూలం. ఏనాడో తాతల కాలం నాటి పంపకాలు. ఏభై ఏళ్లు గడిచిపొయ్యాయి. గట్టురాళ్లు కదల్లేదు. చేలూ కదల్లేదు. ఇప్పుడు మార్చాలంటే ఎట్లా? ఇరవై సెంట్లంటే మాటలా? ఒకప్పుడైతే పెద్ద లెక్కలోదికాదు. ఇవాళ 20 సెంట్లంటే ఇరవై లక్షలు. ఎన్నడూ లేంది ఇట్లాంటి సరికొత్త తగాదాలు ఊళ్లో చానా మొదలైనియ్. కొన్ని పొలాలు ఎటూ తేలకుండా అట్లా మిగిలినియ్.

ఉత్తరాన దూరంగా వెంకన్న వెలిసిన అనంతారం కొండ. అంత లావు కొండని చుట్టుకొని పెద్ద కొండచిలువేదో కదులుతున్నట్టుంది. అదేంటని అడిగాడు వసంత్.

అదో రకంగా నవ్వాడు శీను.

"ఈ పని అవంగానే గట్టుమీదకి వెళ్లిరావాల," అనుకొన్నాడు వసంత్.

ఇప్పటికి రెండుసార్లు సర్వేయర్ల కొలతలైనియ్. పేచీ తెగలా. బుల్లి సర్వేయర్లు తప్పుకొని, ఇప్పుడు డి.ఐ. స్వయంగా రంగంలోకి దిగాడు. ఊరికి మైలు దూరంలో పొలం. దారి సరిగ్గా లేదు. వాగు దాటి చానా దూరం నడవాల. 2015 జనవరిలో జనం పూలింగ్‌కి తమ పొలాలిచ్చారు. ఏడాది గడిచింది. ఇప్పటికీ కొన్ని సర్వేలు, గ్రామకంతాల సమస్య తేలలేదు. ప్లాట్ల సంగతి అతీగతీ లేదు. 9.3 అంగీకార పత్రాలు ఇచ్చినాక లెక్కలు తేలిన రైతులకి ఎకరానికి తలా ముప్పయ్ వేలు లెక్కన కౌళ్లు అందాయి. ఇక వాళ్లు తమ పొలం సాగు చెయ్యరాదు. అయితే ఆ తర్వాత వ్యవహారం ఊడిగిలబడింది. జూన్ నాటికి అందరికీ ప్లాట్లు అన్న మంత్రులు అయిపు లేరు. మొత్తం తంతు ఎంతకాలం దేకుతుందో ఏడాదిగా ఊళ్లో మకాం వేసిన తాసీల్దారు, డిప్యూటీ కలెక్టర్ మొదలు ఎవ్వరికీ తెలీదు. పేచీలున్న నెంబర్లలో సర్వేలకి బయల్దేరిన వాళ్లని అడువులైపోయిన పొలాలు వెక్కిరించినియ్. ఏ రైతునడిగినా సంగతి చెప్పేవాడే. కనీసం ఈ ఏడాది పొలం చేసుకొమ్మని చెప్పినా కోట్ల విలువ చేసే పంట దక్కేది. ఇప్పుడు రెంటికీ చెడింది. ఎటేపు జూసినా పిచ్చిబెండలు, లంజ తుమ్మచెట్లు (ఇంగ్లీషు తుమ్మ) అడివికిమల్లే పెరిగిపోయినియ్. వాటిని మళ్లీ ప్రొక్లెయిన్లతో పీకితేగాని సర్వే కుదరలా. పిచ్చి చెట్ల మధ్య పొలంలో నడవలేక నానా అవస్థ బడతన్నారు సర్వేయరు, అసిస్టెంట్లు. కొలతలైనాక కంప్యూటర్‌లో అన్నీ సరిజూసి, ఫైనల్‌గా ఎవరిదెంతో తేల్చి చెపుతామన్నారు. కోటేశ్వర్రావు సర్వేయర్ని అంటిపెట్టుకోని ఉన్నాడు. వీళ్లవైపు తిరిగి కూడా చూడలేదు.

❖

శీను, వసంత్‌తో పాటు ఇద్దరు చిన్నప్పటి సావాసగాళ్లు అనంతారం గట్టుమీదకి బయల్దేరారు. గట్టిగా మైలున్నర. కొండ మయాన చిన్న గుహలాంటి చోట వెలిశాడు వెంకటేశ్వరుడు. ఏటేటా ఫాల్గుణ మాసంలో ఉగాదిముందు శనివారాలు భక్తులతో కోలాహలంగా ఉంటది. చుట్టుపక్కల ఊళ్ల నుంచి ఎడ్లబళ్ల మీద, ట్రాక్టర్ల మీద జనం తండోపతండాలుగా తర్లి వస్తారు. ప్రభలు గడతారు. కోలాటాలాడతారు. చిన్నపాటి తిరనాలే. వసంత్ చిన్నప్పుడు సావాసగాళ్లంతా ఆటల బండిమీద బుల్లి బుల్లి ప్రభలు కట్టుకొని గట్టుమీదకి వెళ్లేవాళ్లు. దేవుడు, భక్తి అని కాదు. మెట్లు లెక్కబెడుతూ కొండెక్కటం, కోనేరు చూడటం, అందులో బుల్లి బుల్లి చేపపిల్లల్తో ఆడుకోవటం బలే సరదా. కొండమీద నుంచి చూస్తే ఉత్తర దిక్కు తప్ప అన్నీ అవపడతయ్. కను చూపు మేర ఆకుపచ్చ పొలాలు, పలకలు పలకలుగా. ఎంత సంబరమో!

ఇప్పుడు కూడా వసంత్, మరో స్నేహితుడు మెట్లు లెక్కబెడుతూ పైకెక్కారు. చివరికి లెక్క తేలలేదు ఎప్పుడుమల్లే. 367 అని వసంత్ అంటే కాదు, 365 అన్నాడు స్నేహితుడు. మెట్లు గాకుండా ఇప్పుడు కార్లు పైకెళ్లే దారి కూడా ఉంది. రాజధాని నేపథ్యంలో గుడి తిరుపతి దేవస్థానం నిర్వహణలోకి వెళ్లింది. కొత్తగా మెట్లమీద కొంత దూరం పైకప్పు, దీపాలంకరణ కనపడుతున్నయ్. అప్పటిదాకా అచ్చంగా ఉన్న వాతావరణం రాజకీయనాయకుల రాకతో కలుషితమైపోయిందన్నాడు స్నేహితుడు. చిన్న గుహలో వెంకటేశ్వరుడు శ్రీదేవి, భూదేవులతో పక్కన పన్నిద్దరు ఆళ్వారులతో హాయిగా ఉన్నాడు. ఏటవాలు రాతిమీద చెక్కిన బొమ్మలు. ఒక్కసారి కొండ మీద నుంచి చుట్టూ చూశాడు వసంత్. ఒకప్పుడు అక్కడినుంచి తూర్పు, దక్షిణం, పడమట-మూడుదిక్కులా ఆకుపచ్చని చేలు పలకలు పలకలుగా కనువిందు చేసేవి. ఇప్పుడు మూడు దిక్కులా కనుచూపు మేర (అక్కడక్కడ తాడిచెట్లు తప్ప) పైర్ల పచ్చదనం జాడే లేదు. అంతా పిచ్చిచెట్లతో విస్తరించిన చిట్టడవి. ఈ జరుగుతున్న పరిణామాలన్నీ ఆ దేవుడు బిక్కు బిక్కుమంటా చూస్తున్నాడేమో. మెల్లమెల్లగా తనెత్తు మించిపోయిన ఆకాశ భవనాలు లేస్తే చూసి ఏమనుకొంటాడు?

పై నుంచి చూస్తుంటే అదే కొండచిలవ అట్లాగే కొండని బిగించి చుట్టుకోని ఉంది. నిగనిగలాడతా భయంకరంగా ఉంది. దాని బుసలు పైదాక వినపడుతున్నయ్. ఇక దేవుడు కూడా వలసపోక తప్పదేమో. అదేంటని సావాసగాళ్లని అడిగాడు వసంత్. నవ్వారు వాళ్లు, అదో రకంగా. గట్టు దిగినాక అది కనపడలా.

తిరిగి వచ్చేటప్పుడు ఊరికి, కొండకి మధ్య ముచ్చబోడు దగ్గిర ఆగారు. అనంతారం కొండలో మూడో వంతు ఉంటదేమో. ఇప్పుడు సగమైపోయింది. శీను చెప్పాడు, "ఇలువైన రాళ్లకోసం రాత్రింబగుళ్లు తవ్వుతున్నారు. ఆ దుమ్ము తెరల్తో చుట్టుపక్కల చేలు గూడా పాడుబడతన్నయ్. ఎన్ని కంప్లెయింట్లు చేసినా లాబం లేకపోయింది."

ముచ్చబోడు మీద చిన్న కోనేరు. ఒకచోట చక్కగా చెక్కిన పాదముద్ర. 'సీతమ్మ వారి పాదం' అనేవాళ్లు. ఆ ముద్రలో ఎవరి పాదం పెట్టినా సరిపోయిద్దంటారు. బోడెక్కిన పిల్లలు కుశాలగా కాలు బెట్టి చూస్తారు. అబద్ధమే కావచ్చు కానీ అదొక ముచ్చట. అవన్నీ యిప్పుడు పాత జ్ఞాపకాలు. ఏ ఆనవాలూ మిగల్లేదు. కొండ పోతే కొండమీద మబ్బులు పోతయ్. చెట్లు పోతయ్. చిన్న చిన్న జీవాలు పోతయ్. వసంత్‌లో ఏదో దిగులు మొదలైంది. కాలం గడిచేకొద్దీ అన్నీ మారిపోతయ్, నిజమే. కాని ఈ మార్పు ఎటేపు?

మళ్లీ అనంతారం గట్టు వైపు తిరిగి చూశాడు. అదే కొండచిలవ, గట్టును చుట్టుకోని, వెరపిస్తూ.

❖

"అబ్బాయ్! ఎంకట్రామయ్య పెదనాన్నకి బాగుంటంలా. ఎట్టాగూ వొచ్చావుగా. ఒకడుగు అటేసి చూసి రారాదా?" శారదమ్మ అడిగింది, కొడుక్కి కాఫీ యిచ్చినాక.

"నేనూ అనుకుంటానే ఉండానే! చూడకుండా ఎట్లా? చిన్నప్పుడు సూరి, నేను ఆడుకునే వాళ్లంగా."

మాపటేళ వసంత్, శీను తూర్పు వీధినున్న వెంకట్రామయ్య యింటికి బయల్దేరారు. వీధి మలుపు తిరుగుతుండగా కోదండం ఇంట్లోంచి పెద్ద పెద్దగా మాటలు వినపడుతున్నయ్.

"నాన్నా! సివరాకరగా జెపుతున్నా. ఇది తేల్చుకోకుండా మీ అల్లుడు నన్ను గడప తొక్కనియ్యడు. ఇంటి ఆడపడుచుగా నాకు రావల్సిన వాటా ఎంతో ఏందో తేల్చి చెప్పు. లేకపోతే యిక్కడే ఏ నుయ్యో గొయ్యో సూసుకుంటా."

వసంత్‌కేమీ అర్థం కాలా. శీనే చెప్పాడు.

"ఈ మద్దెన ఇయ్యన్నీ మామూలై పోయినియ్‌లే. ఏడేళ్లనాడు కూతురికి పెళ్లి చేశాడు కోదండం మావ ఇయ్యాల్సిన కట్నమేదో అప్పుడే యిచ్చేశాడు. ఇప్పుడు పొలాల రేట్లు పెరిగేతలికి ఆస్తిలో వాటాకొచ్చింది కూతురు. ఇట్టాంటి కొత్త కొత్త తగాదాలు రోజుకొకటి. నీ అదుష్టాన మంచి చెల్లెలు దొరికింది. లేపోతే మీకూ ఈ ఆగం తప్పేది గాదు."

వసంత్ నివ్వెరపోతూ నడుస్తుండగా హఠాత్తుగా కోటేశ్వర్రావు ఎదురయ్యాడు. తమ్ముడు వరస. వసంత్ నవ్వుతూ పలకరించబోతుంటే అతను ముఖం చిట్లగిస్తూ పక్కచూపులు చూస్తూ తప్పుకొని వెళ్లిపోయాడు. వసంత్‌కి చాలా బాధ కలిగింది. చిన్నప్పటి నుంచి ఎంత చనువుగా ఉండేవాళ్లు? కలిసి మెలిసి ఎన్ని ఆటలు ఆడుకొనే వాళ్లు? ఇప్పుడిట్లా ఎడమొగం పెడమొగం. కారణం ఎవరు?

మెల్లగా వెంకట్రామయ్య యింటి దగ్గరికొచ్చారు. పెంకుటిల్లు. పైన కొన్ని పెంకులు లేచిపోయినియ్. ముందు పంచపాళీ. వేపచెట్టు. ఏళ్లనాడు ఎట్లా ఉందో యిప్పుడూ అట్లాగే. కాకపోతే వెంకట్రామయ్యే మరీ వడిలి ఒగుడాకయ్యాడు. డెబ్బయ్యే ళ్లుంటయ్.

"దా దా... కూకో," అని కుక్కి నులకమంచం చూపిచ్చాడు. ""మొన్నే వచ్చా వంటగా? పూలింగు పున్నెమాని యిట్టాగైనా అవపడ్డావు. ఏమేయ్! ఎవురొచ్చారో

సూడు,'' అని పెళ్లాన్ని కేకేశాడు. లోపల్నుంచి రత్తమ్మ వచ్చింది. సన్నగా చిక్కిపోయుంది. పాత చీరలో, గుంటకళ్లతో, ముఖంలో దిగులు నీడతో ఏదోగా ఉంది.

''ఏయ్యా! బాగుండావా?'' అని నవ్వుతా పలకరించినా అందులో పొడితనమే. ఇద్దరూ చానా దిగులుతో ఉన్నట్టు అవపడతానే ఉంది. పలకరింపులైనాక సూరి గురించి అడిగాడు వసంత్.

''ఆడా? ఇయ్యాల్టికి ఇరవై రోజులైంది దేశాలమీద బొయ్యి. ఏందో జేసి లచ్చ ల్లచ్చలు ఒళ్లో గుమ్మరిస్తాడంట. ఇక్కడుందంతా ఊడ్చేశాడు. ఈ వొయిసులో మాకీ కట్టం తెచ్చిపెట్టాడు,'' వెంకట్రామయ్య చెపుతుంటే రత్తమ్మ కళ్లల్లో నీళ్లు దిరిగినియ్. ఆయన మాటల్లో వివరాలు తెలిసినియ్.

రాజధాని అనంగానే రియల్ ఎస్టేట్ వాళ్లు దిగారు. ఎక్కడెక్కడ మాయదారి డబ్బంతా ఇటేపు మళ్లింది. పొలాలకి రేట్లు విపరీతంగా పెరిగినియ్. యాభై లక్షలు మొదులుకోని రోజుకో రేటు లెక్కన పెరుగుదల. రాజధాని ఊళ్లల్లో ఇది ఒక చివర నైరుతి మూలన ఉంది. కనక ఇక్కడ ఆఖరి బేరం కోటి, ఇరవై లక్షలు పలికింది. ఇంకోవైపు ఇంటిమీద బాకీ తన్నుకొస్తంది. అయ్య ఒప్పుకోకపోయినా సూరి ఉన్న ముప్పాతిక ఎకరం అమ్మాడు. బాకీ తీరింది. తక్కిన డబ్బుల్తో దూరంగా బొయ్యి ఐదెకరాలు కొందామన్నాడు. అట్లా కొనుక్కొని సర్దుకున్న వాళ్లున్నారు. కొనుగోలు కుదరక అదుగో ఇదుగో అని సరిపిస్తంటే డబ్బు తిమ్మిరి ఆగనిస్తదా? పేకాట, తాగుడు- రెండూ పూరాగా ఉన్నయ్ సూరికి. రెండునెల్లు దిరిగేపాటికి చేతిలోది హుష్ కాకి అయ్యింది. ఇంక మిగిలిన పది లక్షల్తో ఏదో చేద్దామని ఎక్కడికో పొయ్యాడు. రెంటికీ చెడ్డాడు.

'ఎన్నడూ కళ్లజూడని డబ్బు అవపడేతలికి, తల్కుండమొయ్య! జనానికి ముడ్డి మీద గుడ్డ నిలవటంలా. ఈ మారుమూల పల్లెటూళ్లో ఐదంతస్తుల బవంతులు కల్లో అయినా ఎరుగుదుమా? ఇప్పటికి ఊళ్లో మూడు లేసినియ్. ఉంకోటి రెడీగుంది. ఆలు లేదు, సూలు లేదు. అప్పుడే యిదంతా పేద్ద నగరమైపోయినట్టు, మనమేందో సొర్గంలో ఉండట్టు కల గనేవోళ్లు కంటన్నారు. అంతా మాయ. కలి మాయ,'' అన్నాడు వెంకట్రామయ్య.

''బర్రె సచ్చినాక పాడి బైటపడుద్ది. అట్టనే పోయినాకే దేని యిలవైనా తెలుసుద్ది. అరే, ఎవుడెన్ని జెప్పినా సిమెంటు కన్నా మట్టి శానా యిలువైందిరా,'' అన్నాడు మళ్లీ.

''ఔ మావా! కంపెనీలు, కంపూటర్లు తిండిగింజలు రాలుస్తయ్యా?'' అన్నాడు శీను.

వసంత్ ఏమీ మాట్లాడలేదుగానీ తన ఆలోచనల్లో లోపం అర్థమవుతుంది. ఉన్నట్టుండి, "పెదనానా! అనంతారం గట్టును చుట్టుకోని ఆ చిలవేంటి?" అనడిగాడు.

నీరసంగా నవ్వాడు వెంకట్రామయ్య.

అక్కణ్ణుంచి బయటపడి తక్కిన చుట్టాల యిళ్లు తిరగేశాడు వసంత్. ఒకళ్లిద్దరు పాత యిళ్లు తీసేసి డాబాలు గట్టారు. ఉన్న పొలంలో కొద్దిగా అమ్ముకోని బాకీలు దీర్చుకొన్నారు. భూములు పూలింగ్‌కి ఇచ్చినందుకు తిరిగి గవర్మెంటు ఇయ్యబోయే నివాస, వాణిజ్య ప్లాట్ల గురించి చర్చిస్తున్నారు. వానలు, పైర్లు, తెగుళ్లు, కలుపులు, కోతలు- ఇటువంటి మునుపటి మాటలు విందామన్నా ఎవరి నోటమ్మటా రావటం లేదు.

అయితే వాళ్ల మాటల్లో ఇంకా చాలా సంగతులు తెలిసినియ్. భూములిచ్చిన రైతులు ఏ జెయ్యాల? పోగలిగిన వాళ్లు చుట్టుపక్కల ఊళ్లలో పొలం కౌలుకు తీసుకొని సాగిస్తన్నారు. పోలేనివాళ్లు రచ్చబండల దగ్గర గోళ్లు గిల్లుకొంటున్నారు. కూలి నాలి జనానికి కొత్త 'నైపుణ్యాలు' నేర్పి రాజధానిలో కొత్త పనులు చూపిస్తామన్నారు. అదంతా వట్టిమాటైపోయింది. నైపుణ్యాలూ లేవు, పనులూ లేవు. కాస్త సత్తవ ఉన్న ఆడ వాళ్లు పొరుగూళ్ల పొలాలకి కూలికి పోతున్నారు. మగవాళ్లు కరెంట్ పనులకో, బేల్దారి పనులకో పొద్దున్నే గుంటూరో, బెజవాడో వెళ్లి రాత్రికి ఇల్లు జేరతన్నారు. అంత ఓపిక లేని ఆడవాళ్ల పరిస్థితేంటి? మునుపు ఊళ్లో కూలో నాలో చేసుకొనే వాళ్లకి ఇప్పుడు ఇంటి ముందు సోది కబుర్లతో పొద్దు పోతంది. మొత్తానికి ఊరు తల్లకిందులైంది. ఇంక కుటుంబాల్లో నడమంతరం సిరి వల్ల తగాదాలు సరేసరి. ఏనాడూ లేని కల్లోలాలు. వింటున్న వసంత్‌కి కళ్ల ముందు కలలేవో మసకబారుతున్నయ్.

❖

ఆమధ్య అంతా రాజధాని, రాజధాని అంటుంటే తను కూడా ఉద్దండ్రాయ పాలెం వెళ్లొచ్చాడు శీను. ఊళ్లో రైతులందరికీ ఆహ్వానాలిచ్చారు. పట్టుపంచెలు, పట్టు చీరలు అంటూ చివరాకరికి మామూలు నూలు బట్టలిచ్చారు. ఒకటే కోలాహలం. దేశంలో అన్ని ప్రాంతాలనుంచి మట్టి సేకరించారు. మూడు మతాల వాళ్లూ మంత్రాలు చదివారు. ప్రధాని స్వయంగా తళతళలాడే పాత్రల్లో మట్టి, గంగాజలం తెచ్చాడు. శంకుస్థాపన అయింది. గొప్ప గొప్ప ఉపన్యాసాలు. ఇంతకీ రాజధాని వస్తే ఎవరికేం ఒరిగిద్దో శీనుకి బోధపడలా.

ఇప్పుడు రాజధాని ప్రాంతం చూడాలన్నాడు వసంత్. పొద్దున్నే శీను, తను తుళ్లూరు మీదగా రాయపూడి, లింగాయపాలెం రోడ్డు దాటి, మోదులెంకాయపాలెం

మీదగా ఉద్దండ్రాయపాలెం చేరారు. రోడ్డు మీదనే 'అమరావతి రాజధానికి దారి' అనే బోర్డు కనపడింది. ఉద్దండ్రాయపాలేనికి ఈశాన్యంగా ఉంది ఆ ప్రాంతం. ఒక షెడ్డు ముందు ఇద్దరు పోలీసులు కాపలా ఉన్నారు. లోపల విశాలమైన బల్లమీద రాజధాని ప్రాంతంలోని 29 ఊళ్ల వివరాలున్నయ్. ఎక్కడ వంతెనలు, మెట్రోలు. రహదారులు, ప్రధాన నిర్మాణాలు వస్తాయో మినియేచర్‌లో చూపిస్తన్నారు. తర్వాత హోమం జరిగిన పాక చూశారు. దానికి కుడివేపు దేశదేశాల నుంచి సేకరించిన మట్టి, నీటిపాత్రలు ఉన్నయ్. హోమవేదికకి తూర్పుగా శంకుస్థాపన జరిగిన చోట పది అడుగుల శిలాఫలకం కూడా గర్వంగా నిలబడి ఉంది. అయితే దానిమీద జనానికి తెలియటానికైనా ఒక్క తెలుగు ముక్క లేదు.

అన్నిటినీ మించి వసంత్‌ని, శీనుని బాధించిన అంశం వేరు. శంకుస్థాపన తావుకు చుట్టుపక్కల పచ్చదనమంతా అదృశ్యమైపోయింది. ఉత్తరం కరకట్ట, పడమట లింగాయపాలెం, తూర్పున వెలగపూడి. ఇంతకుమునుపు ఈ తావంతా పచ్చటి అరిటి తోటల్తో చల్లచల్లగా ఉండేది. ఇప్పుడు అదంతా ఎడారైపోయింది. మొత్తం ఇప్పుడు విషపూరితమైన ఒయ్యారిభామ (పార్థీనియం) మొక్కల పూలవనం! దూరంగా వెలగపూడి కవతల లేస్తున్న సచివాలయ భవనం పునాదులు.

"ఎవుడికోసం ఈ రాజధాని? ఏ సింగపూరోడో వొచ్చి ఈడ బిల్డింగులు గడితే మనకేం ఒరిగిద్ది? వందలొందల యెకరాలు పందారం జేసి, కోట్లు కోట్లు సేతులు మారటానికే బావా! యిదంతా," శీను ఆవేదన.

వసంత్ మనస్సులో వేరే ఆలోచనలు కదలబారుతూ. 'అయితే నీ ఊరమ్మట రాజధాని రావటం ఇష్టం లేదా?' తనకు తనే ప్రశ్నించుకొన్నాడు. ఇష్టమే. కాని కొన్ని పరిపాలనావసరాల కోసం ఇంత 'అతి' అవసరమా? ప్రపంచస్థాయి రాజధాని అనేది ఒక కల్పన. అంతకుమించి అది ఒకే ఒక్క వ్యక్తి కల. అది ఎవరి అవసరాలు తీరుస్తుంది? మహానగరాల్ని వెంబడించే కాలుష్యం, నేరవ్యవస్థల సంగతేమిటి? ఒక రాష్ట్రస్థాయి పరిపాలన కోసం 33 వేల ఎకరాల ఆకుపచ్చని నేల సిమెంట్ రంగులోకి మారాలా? అది చాలక 5 వేల ఎకరాల అడవులు డీ నోటిఫై చెయ్యాలా?

పచ్చని పొలాలు బీళ్లు. అడవులు డీ నోటిఫై. ఆ పైన హెలికాప్టర్ మీద నుంచి కొండల్లోకి విత్తనాలు చల్లటం. (పైనుంచి నేల బలే అందంగా కనపడిద్ది.) వానలకి వీడ్కోలు చెప్పి, నీటిమట్టం కోసం ఇంకుడు గుంటలు తవ్వటం. అందరి మీదా అభివృద్ధి మంత్రజలం చల్లటం.

❖

...ఒకటే చీకటి. కళ్లు పొడుచుకున్నా కనపడని చీకటి ముసురు. దట్టంగా మబ్బులు. కాని వానచినుకు లేదు. అంతలో బొయ్యిన ఒకటే వడగాలి. అదేదో మహాసర్పం ముక్కుల్లో నుంచి వీస్తున్నట్టుగా. ఇళ్ల కప్పులు లేచిపోతన్నయ్. చెట్లు కూలిపోతన్నయ్. రామాలయం ముందు ధ్వజస్తంభం గజగజలాడింది. గొడ్డూ గోదా ఒకటే మైన అరుస్తున్నయ్. కళ్లల్లో, ఒంటినిండా ఇసిక. తెరలు తెరలుగా ఇసిక. అంతా కటికి చీకటి. మనుషులు కొట్టుకుపోతన్నారు. తను ఊరమ్మటి తాడిచెట్టును కావిలించుకొని, కొట్టుకుపోకుండా ఆగాడు. అమ్మ ఏమైపోయింది? ఎటు కొట్టుకు పోయింది? ఎటు? అమ్మా! అం...మ్మా!...

ఉలిక్కిపడి లేచాడు వసంత్. చుట్టూ చూశాడు. ఎదురుగా గోడమీద నాన్న ఫొటో. పక్కన కాలెండర్. మరోవైపు గోడ గడియారం. పై కప్పు మూలన బూజు. పంచపాళీలో ఆరిన బట్టలు మడతేస్తూ అమ్మ. ఊపిరి పీల్చుకొన్నాడు వసంత్.

లేచి మెల్లగా అమ్మ పక్కన కుర్చీలో కూర్చున్నాడు. "అమ్మా! పొలం పూలింగ్‌కి ఇచ్చి తప్పు చేశామా?"

శారదమ్మ ఒకసారి కొడుకేపు తేరిపార జూసింది. "మీ నానకి పొలమంటే పంచ ప్రాణాలు. అందరం దానిమీదే బతికాం. ఇయ్యటం నాకూ ఇష్టంలేదు. ఊళ్లో జన మంతా శానా మల్లగుల్లాలు పడ్డారు. చివరికి మెత్తబడ్డారు. ఇంక తప్పంటావా? అది జనం అందరిదీ నాయనా!"

"అమ్మా! అనంతారం గట్టు చుట్టూ ఆ కొండచిలవేందే?"

శారదమ్మ దిగులుగా నిట్టూర్చింది.

వసంత్‌కెందుకో తన చిన్నతనం గుర్తొచ్చింది. జొన్నచేలు, కందిచేలు, మిరప చేలు, లేగదూడలు, కోడెగిత్తలు, బీళ్లు, గడ్డిపూలు, రంగు రంగుల సీతాకోకచిలకలు, వానమబ్బుల కింద ఎగిరే ఎర్ర తూనీగలు, గడ్డి మొక్కల మీద బులుగు తూనీగలు, ఆరుద్ర పురుగులు, వానపాములు, పంటపొలాల మీద రివ్వున వాలే పిచ్చికలు, రామచిలకలు, ఉత్తతీతలు- ఇయ్యన్నీ ఏమైపోయినియ్? పొలాల్లో జమ్మిచెట్లన్నీ కొట్టేస్తే వాటి కొమ్మల్లో గూళ్లు పెట్టే తనకిష్టమైన పాలపిట్టలన్నీ ఏం గావాల? ఒక్కసారిగా ఒళ్లు జలదరించింది. తల్లి నిట్టూర్పుకి అర్థం తెలుస్తుంది.

ఊళ్లోకి సిమెంట్ రోడ్డొచ్చింది. బస్సులు, కార్లు వచ్చినియ్. చల్లలు పోయి, కూల్‌డ్రింకులు వచ్చినియ్. బాయినీళ్లు పోయి మినరల్ వాటర్ కాన్‌లు వచ్చినియ్. బెల్ట్ షాపులు, బీర్లు, విస్కీలు వచ్చినియ్. గుడిసెలు, పెంకుటిళ్లు పోయి డాబాలు, ఐదంతస్తుల భవనాలు వచ్చినియ్. ఇదంతా నిజంగా అభివృద్ధే అయితే మనుష

లెందుకు సంతోషంగా లేరు? మనసులెందుకు ఇరుకైపోయినియ్? ఆలోచిస్తున్న కొద్దీ కడుపులో ఏదో దేవుతున్నట్టుంది. లోపలేదో రొద. చెవి పక్కన తెంపు లేని పెను బుస. దాని మూలం తెలుస్తుంది.

ఏంజెయ్యాలో పాలుపోలేదు వసంత్‌కి. ఆ మాపటేళ శీనుతోపాటు రాములవారి గుడికాడికెళ్లాడు. గుడి మండపంలో కనుచీకట్లో ఎవరో ముగ్గురు రైతులు లోకాభి రామాయణం చెప్పుకొంటన్నారు. వాళ్లతో మాటలు కలిపాడు.

కాస్త ఎడంగా ఒంటిమీద గుడ్డ సరిగ్గా లేని ఎవడో తాగుబోతు. చేతులూపుతూ బ్రహ్మంగారి కాలజ్ఞానం కల్తీ చేసి పాడతన్నాడు.

'మీసాము లేనోడు దేశానికొచ్చీని, మహి కొండలకు జెండ వేసీని మా. చెరువు లెండీ పోయి దొరువులెండీ పోయి నెత్తుటీ వానలు కురిసేను మా. యేనుగుకు పంది బుట్టీని. పందికి యేనుగు పుట్టీని. ఏలిక కడుపున ఏలిక పుట్టీని. మట్టి కడుపున బూడిద పుట్టీని. మట్టి మనుషులు తుదకు మట్టిపాలయ్యేరు, ఏలికలు నాలికలు సాచేరు మా. కల్లదేవతలాను గొలిచేటి వారెల్ల నిల్వ పేరు లేకపొయ్యేని. స్త్రీల కన్నుల నెత్తురు కురిచీని. పంచాంగాలు మూలబడును. పైర్లు నాశనమగును. నీతి వర్తనములు తప్పి నడిచేరు. చోరుల బాధలు హెచ్చీని. ఉల్లిగడ్డలకు ఉపదేశమిచ్చేటి కల్ల నేతలు కలిలొ నుండేరు మా. శ్రీశైల శిఖరాన నిప్పులు రాలీని. బసవేశ్వరుని కంట నీళ్లు గారీని. కటకటాయని రంకె వేసీని. ధణం ధణం యని కాలు దువ్వీని. పూని పౌర్ణమి అమావాస్య అయ్యీని. పూని పౌర్ణమి అమావాస్య అయ్యీని. పూని పౌర్ణమి...'

*అరుణతార మాసపత్రిక*
*జూన్ 2016*

✻




పాపినేని శివశంకర్ 6 నవంబర్ 1953న గుంటూరు జిల్లా నెక్కల్లులో జన్మించారు. వీరి మొదటి కథ *కలుపు మొక్క* 1977లో ప్రజాతంత్రలో అచ్చయ్యింది. *మట్టిగుండె, సగం తెరిన తలుపు* కథాసంపుటాలు, ఐదు కవితా సంకలనాలు, మూడు వ్యాససంపుటాలు, ఒక పరిశోధనా గ్రంథం ప్రచురించారు. రజనీగంధ కవితాసంపుటానికి 2016లో కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు లభించింది.

*చిరునామా: 4-5-29/60, 3వ లైను, విద్యానగర్, గుంటూరు-522007*
*ఫోన్ : 85008 84400* **papineni22@gmail.com**